౪౨

స్వార్థం

అప్పుడే టైలరు పెళ్ళి బట్టలు ఇచ్చి వెళ్ళేడు. జరీ జాకట్టు తొడుక్కుని సావిత్రి అద్దంముందు నిలుచుంది. కోయంబత్తూరు పట్టు జాకెట్టు — ఆకుపచ్చ రంగుది నాలుగువేళ్ళ వెడల్పున మంచిరకం జరీ అంచు దీనికి 'మేచ్' అయే చీర కట్టుకోవాలని ఆమెకు అనిపించింది. ముందురోజున ఆయన కొని తెచ్చిన కాశ్మీరు సిల్కుచీర — లేతాకుపచ్చది కట్టుకుంది.

ఎంత బాగుంది!

ఈసారి తను ఎంత నిండుగా ఉంది!

ఈ చీర ఖరీదు డెబ్భై అయిదుట.

ఇన్నాళ్ళకి...ఇన్నేళ్ళకి తను డెబ్భై అయిదు రూపాయిల చీర కట్టుకుంది.

సావిత్రి ఒళ్ళు పులకరించింది.

'ఏం సావిత్రీ' నన్ను మరిచిపోయావా? ప్రతిబింబం ప్రశ్నించింది. 'ఎందుకు మరిచిపోయానూ? నిన్ను మరిచిపోలేదు కాబట్టే — నీతో పోల్చుకుంటున్నాను కాబట్టే నా కిప్పు డింత ఆనందం!' అనుకుంది సావిత్రి. అమ్మ ఎక్కడ సుఖపడిపోతుందో అని పిల్లలంటే తరుముకొచ్చారు గాని అప్పటికి తనకింకా పాతిక నిండలేదు!

ఈ సంసారపు ఖర్చులు ఎప్పుడూ ఉన్నవే అనుకుని — కాపురానికి వచ్చిన ఎనిమిదేళ్ళలోనూ మొదటిసారి స్వతంత్రించి — పక్కింటావిడ తెప్పించుకుంటూంటే తనూ సరదాపడి — వెంటనే డబ్బు అడగని పద్ధతిలో మైసూర్ జార్జెట్ చీర ఏమైతే అయిందని తెప్పించేసుకుంది. సరి...ఆ డబ్బు తీర్చడం కోసం ఎన్ని పాట్లు పడిందో...

'ఏవండీ, ఏవండోయ్...ఇలా చూడండీ...కొట్టువా డివాళ యింటి కొచ్చి అడ్డవ(యిన మాటలూ ఆడి వెళ్ళేడు. అయినా అంటే వాడిది తప్పా ? ఎన్నాళ్ళని తిప్పుతాసు ? ఈ నెలకి ఓ ఇరవైయేనా వాడి చేతిలో పెడ్తేగాని...' 'ఇరవై కాదుగదా ఒక్క దమ్మిడి అయినా ఇవ్వను. నన్నడక్కుండా నిన్నెవడు ఉరెట్టుకోమన్నాడు ? ఈ పెత్తనం ఎవడిచ్చాడంట? చంటిపిల్లలా సరదాలూ నువ్వూ, సిగ్గులేదు ?' మొగుడిచేత ఇలాంటి మాటలు బాగా అలవాటయిన సావిత్రికి నిజంగా సిగ్గూలేదు, అభిమానమూ లేదు. ఆమె కంట్లో కన్నీళ్ళు తిరగలేదు. 'ఏదో బుద్ధితక్కువ కొద్దీ నేకొన్నాను. తీరా ఇన్నాళ్ళయాక వాడు తిరిగి పుచ్చుకోడుగా.ఏవండీ, ఇదిగో ఒక్క పదిహేనైనా ఇవ్వండి, మీరు సిగరెట్లకి తగలేసినంత లేదు...'

'నోర్ముయ్! నా యిష్ట మొచ్చినట్టు నేను ఖర్చు పెడతాను. నువ్వెవ త్తివి నన్నడగడానికి ?'

ఆయన అనడమూ బాగానే ఉంది తను పడడమూ బాగానే ఉంది. ఆ మధ్య సుశీల జబ్బుగా ఉందని తెలిసి పుట్టింటికి వెళ్ళినప్పుడు తను ఆవిడ్ని కదిపి చూసింది.

'అమ్మా, ఓ యాభై రూపాయ లుంటే ఇద్దూ, తరవాత సద్దుతాను...'

'అయ్యా బాబోయి యాభై రూపాయిలే! నే నెక్కడ తెచ్చేది సావిత్రీ ? ఈ యేడాది సిస్తులయినా సరిగ్గా వసూలు కాలేదు. ఇంట్లో ఖర్చులు నువ్వు ఎరగంది ఏముందే ?'

అడిగిందే తడవుగా ఆవిడ అన్నీ ఏకరువు పెట్టింది.

పెద్దాడేమో మళ్ళీ B. com గుద్దించేసి ఇంట్లో ఆఘోరిస్తున్నాడుట.

రెండో వాడికి యింకా ఎక్కడా సీటు రాలేదు, అప్లికేషన్లకే ఎంతయినా అవుతోందిట.

ఇక సుశీల సరేసరి టైఫాయిడ్‌తో యిల్లు చేరుకుంది. ఏదో బతికి బయటపడిందిగాని దాని ఇంజక్షన్లూ పళ్ళరసాలు టానిక్కులకే నెలకి యాభై పైగా అవుతోందిట.

ఇక సూరేడు సరేసరి...బళ్ళోకెళ్ళే పిల్లా...దాని బట్టలూ, పుస్తకాలూ తప్పనిసరి ఖర్చుట.

ఇక ఆఖరాడు ఎస్సెస్సెల్సీ అక్టోబరుకి వెడుతున్నాట్ట. వాడి ప్రవేటు మేష్టారికి నెలకి ఇరవైట.

ఇంకా ఎన్ని టాటాలు ఉన్నాయిటా? ఇవన్నీ ఎవరికి తెలియనివటా? అక్కడితో ఆపుతే బాగానే ఉండును.

'ఈ పిల్లల్ని నాకు అంటగట్టి తనదారి తను చూసుకున్నారు. దిక్కుమాలిన దాన్ని ఆయనతో నేనూ వెళ్ళలేక పోయాను'

అమ్మ కళ్ళనీళ్ళు తుడుచుకుంది...సావిత్రి మొహం తుడుచుకుంది. తల్లి తోడూ అంటారు. ఇదే కాబోలు. అందుకనే ఆవాళ వచ్చేస్తూంటే ఆవిడ రైలు ఖర్చులకని పదిహేను రూపాయిలు తన చేతిలో పెడితే —

'నా కక్కర్లేదమ్మా, చాలా యిచ్చావ్, చాలా పుచ్చుకున్నాను...చాలు... నీ దగ్గరే ఉంచు. వచ్చే డబ్బు వస్తున్నా పాపం నీకు బోలెడన్ని ఖర్చులూ, నువ్వేం చేస్తావ్'

ఆవిడ మొదట వెలవెలబోయింది — అంతట్లో ఎలా వస్తుందో ఆ నవ్వు ముసిముసిగా నవ్వింది...

'అంతట్లోనే తేలిపోయావుటే నా తల్లీ...ఏమంటే అన్నావుగాని సొమ్ము తీసుకో...'

ఇష్టంలేదు గాని సొమ్ము ముఖవిశేషం, అవసరం అంతటిది...తను పుచ్చుకోబోతూంటే ఆవిడ మరో పుల్లవిరుపు మాట అందించింది.

'...మొత్తానికి మా అల్లుడు బాగానే నేర్పేడే మాటలూ!'

'మధ్యని ఆయన్నెందుకు అనవసరంగా ఆడిపోసుకుంటావ్. నువ్వు ఇవ్వనూవద్దు, నేను పుచ్చుకోనూవద్దు. నీకు మా కిచ్చే పక్షంలో అసహజపు ఖర్చులుగాని, తక్కినవన్నీ అతి సహజమేగా! అయినా ఇందులో ఆయన మాట ఏముంది గనక? ఆడకూతుర్ని అభిమానం చంపుకోలేక దేవుల్లాడు తున్నానుగాని నాకు లేకపోయినా ఆయనకింకా మిగిలి ఉందిలే సిగ్గు! మళ్ళీ మీ గుమ్మం తొక్కేరా?'

ఈసారి ఆవిడ వంచిన తలెత్తలేకపోయింది. లేకపోతే...ఊరుకుం టూంటే మీద మీదకు వస్తుందా?

ఒక్క చీరకు ఇంత అల్లరా? ఆ తరవాత ఏడాదిన్నరపాటు నానా యిబ్బందీపడి మిగిల్చి ఆ చీరడబ్బు కొట్టువాడి మొహాన్ని కొట్టేందుకు తను ఎన్నిపాట్లు పడిందనీ!

ఇవాళ...తను...హాయిగా...మొగుడు కొని తెచ్చియిస్తే...దర్జాగా ...ఒకటికాదు, రెండుకాదు డబ్భై అయిదు రూపాయిల చీర కొనుక్కుంది! తను 'దేహీ' అని ఎవర్నీ అడగనక్కర్లేదు.

ఎవరి పెట్టుపోతలూ తనకి అక్కర్లేదు.

నిజానికి డబ్భై అయిదు రూపాయిల చీర కొనే స్తోమత ఆయనకి ఎక్కణ్ణుంచి వచ్చిందీ?

రెండువేల రూపాయిలు చేతిలో పడబోతున్నాయి కనక.

'రెండువేల రూపాయిలే! 'ఎక్కడివి?' ప్రతిబింబం నిలదీసింది. సావిత్రి మొహం ముడుచుకుంది.

'నీ కక్కర్లేనివి లేవు...అన్నీ తెలిసీ తెలియనట్లు అడుగుతావు. అందు కనే నువ్వంటే అందరికీ వళ్ళుమంట.'

అని విసుక్కుంది సావిత్రి. విసుక్కుంటూనే జరిగినవి తలుచుకుంది. ఎప్పుడూ లేంది ఆ రోజు...అంటే ఇది పదిరోజుల క్రిందటి ముచ్చట...

ఆయన చాలా హుషారుగా ఉన్నారు. పిల్లలికి పీచుమిఠాయి కొని తెచ్చి పెట్టేరు. తనకేమో యిష్టమని మల్లెపువ్వులు తెచ్చియిచ్చారు. పిల్లలు భోంచేసి పడుకోగా...పెద్దది ఎంగిళ్ళు తీస్తూండగా తన్ని డాబామీదకి రమ్మన్నారు.

'మీ సూరీడుకుకి మంచి సంబంధం కుదిర్చాను.'

ఎవరి గుణాలు వారికి ఉండుగాక—సావిత్రి మాత్రం చాలా సంతోషించింది.

'ఎంత మంచి కబురు చెప్పేరండీ...పాపం ఒక్కర్తీ నానా కష్టాలూ పడుతోంది. ఈమధ్య దాని పెళ్ళి అవదేమో అని మా అమ్మ మంచంకూడా ఎక్కింది వయస్సొచ్చినా మా తమ్ముళ్ళవల్ల ఎటువంటి సాయమూ లేకపోయె...ఇంతకీ ఎవరూ, ఎక్కడా...ఏమిటీ...?'

'ఎక్కడోకాదు ఈ ఊళ్ళోనే ఉన్నారు. అబ్బాయి ఎం. ఎస్సి. చదువు తున్నాడు. బావుంటాడు కూడా...తండ్రి లేడుగాని తల్లి సుబ్బమ్మగారని ఉంది. ఒక్కడే కొడుకూ...బోలెడంత ఆస్తి...స్వంత ఇల్లూ...మావిడి తోటా...'

'పోన్లెండి బాగుంది...కట్నం ఎంతా?'

చూస్తుండగానే ఆయన మొహం మారిపోయింది.

'ఈ రోజుల్లో ఏమంత ఎక్కువలే, ఆరువేలు.'

'అమ్మయ్యో ఆరువేలే!...మూడు వేలు దాటి ఎవరికీ ఇచ్చేరగదే, ఆరువేలే!' ఎక్కణ్ణుంచి తెస్తుందండీ...'

'లేకపోతే, తెచ్చిన సంబంధాలన్నీ ఇలా తిరక్కొట్టేస్తూంటే నువ్వుకూడా మీ అమ్మతో కలిసి కట్టకట్టుకుని గంగలో దిగు. నాకేం? పదిమంది మను షులు పది కాలాలపాటు తినే ఆస్తుండే...కనుచూపుమేర ఎక్కడ చూసినా పెద్దలు గడించి పారేసిన భూము లున్నాయే...లంకంత స్వంత ఇల్లుందే...

బంగారు కణికెలు చేయించికూడా పట్టిగెడుతుందా ఆవిడ ? మన పెళ్ళినాడు ఏం పెట్టిందో అంతే. గొఱ్ఱెతోక జీతంతో, ఒంటిచేతి సాయంతో పట్నంలో నెగ్గుకొస్తున్నానే...కాణీ కళ్ళ జూపిందా ఆవిడ ? మంచిగా కుదరనిచోట వంచనే మందు. నిజం చెప్పవలసివస్తే ఆ కట్నంలో నాలుగువేలు అతనివీ, రెండువేల రూపాయిలు మనవీను...'

ఆయన నాలిక్కొరుచుకున్నారు. తను తెల్లబోయి ఆయవైపు చూసింది.

'ఆదే లోపాయికారీ ఏర్పాటు, అంతే...'

సావిత్రి గుండె దడదడ కొట్టుకుంది. ఆమె పెదవులు వణికాయి. ఆమెలో ప్రతి అణువూ వద్దు...వద్దు...అని అరిచాయి.

'మనకొద్దు, ఇలాంటి కక్కుర్తి పనులు మనకి ఎంతమాత్రం వద్దు.' వద్దొద్దు. దీనికి నే నెంతమాత్రం ఒప్పుకోను.'

అంత గట్టిగానూ ఆయన అరిచారు. 'అవును, ఎందు కొప్పుకుంటావు? ఒక కోడల్ని ఒకలాగా, ఇంకో కోడల్ని మరొకలాగా చూసే అత్తలు చాలామంది ఉన్నారు. కాని ఒక కూతుర్ని ఒకలాగా మరొకకూతుర్ని ఇంకోలాగా చూసే తల్లులే అరుదు. కొంచెమేనా సిగ్గూ అభిమానమూ ఉండి జరిగినవి జ్ఞాపకం తెచ్చుకుంటే సరీ..."

ఆయన గబగబా కర్రమెట్లు చప్పుడు చేసుకుంటూ దిగిపోయారు.

ఆయన మాటా పూర్తిగా కొట్టిపారెయ్యడానికి వీల్లేదు మరి.

ఆయన అనుభవాలు అలాంటివి.

తన పెళ్ళికి ఆయనకి వెయ్యినూటపదహార్లు కట్నమిచ్చారు.

తన పెద్దచెల్లి తాయారు మొగుడికి మూడువేలు యిచ్చారుట. ఇస్తే ఇచ్చారు ఎవరికి కావాలిటా ? ఎవడిక్కావాలీ వెధవ సొమ్మూ ? చిత్రం, అమ్మ మాట మాత్రమయినా తనతో చెప్పలేదు. పోనీ, అలా అని ఊరు కుందా...వీళ్ళతో వాళ్ళతో రహస్యంగా అంటుందిటా –

'బాబ్బాబు, గంపెడు పిల్లల తల్లిని...ఒంటి ఆడకూతుర్ని...ఇలా మూడువేలు యిస్తున్నామని వాళ్ళకి తెలియనివ్వకండి బాబూ, మా పెద్దల్లుడసలే కోపిష్టి...ఆయనతో వెయ్యినూట పదహార్లనే చెప్పండి' ఆవిడ అతి గడుసుతనం గాని ఇలాంటివి దాగమంటే మాత్రం దాగుతాయా? ఇంకా ఒక అడుగు అవతలే ఉంది, ఆ వియ్యాలవారు కష్టం సుఖం చెప్పుకోవలసినవాళ్ళు — ఇంటికి పెద్దల్లుడూ, పెద్దకూతురూ పరాయివాళ్ళు అయిపోయారా? ఆయనకి ఒళ్ళు మండించంటే మండదూ? ఎందరెన్ని చెప్పినా వినకుండా, పెళ్ళికయినా ఉండకుండా లేచి చక్కాపోయారు. ఇంకా అంతో ఇంతో మంచివారు కాబట్టే తన్నయినా ఉంచారు. అదీ గ్రహించినవారు లేరు.

రెండో చెల్లి సుశీల పెళ్ళికి రానుమొర్రో అని ఆయన భీష్మించుక్కూచుంటే పెద్దతమ్ముడు వచ్చి బతిమాలి తీసికెళ్ళేడు.

అయితే అంత భేదబుద్ధి అయితే మనసులు విరిగిపోయాయంటే విరిగిపోవూ? తాయారు మొగుడికేమో నాలుగువేళ్ళ వెడల్పు జరీ అంచు పంచె పెడితే ఈయనకేమో మూడువేళ్ళ వెడల్పుది పెడుతుందా? ఏమీ అని అడుగుతే—

'అయ్యయ్యో...ఎంత పొరపాటు జరిగింది! గుడ్డి దాన్ని సరిగ్గా చూసుకోలేదు తల్లీ...కొట్టువాడు ఓ దానికొకటి యిచ్చాడు కాబోలు. మళ్ళీ మరో పంచె వెంటనే తెప్పించి ఇస్తాగా' అని నలుగురికీ వినపడేలా రాగాలు మొదలెడుతుందా? తనకే కారం రాసినట్లయిందే, ఆయనకి ఒళ్లు మండిందంటే మండదూ?

'అక్కర్లేదండీ...చేసిన అవమానం చాలు. అయినా మీ తప్పు ఏముందీ? ఆయనేమో డాక్టరూ, రెండుచేతులా సంపాదిస్తున్నాడు. నేనా బతకలేని బడిపంతుల్ని. ఎవరి తాహతుకి తగినట్టు వారికి పెట్టేరు. మీ తప్పేముంది?

అంతే. ఇలా మూడుముళ్ళూ పడ్డాయోలేదో తనకుటుంబం రైలెక్కేరు. అంత సులువుగా మరిచిపోయే అనుభవాలా యివి? వాళ్ళంతా ఉన్నవాళ్లు, తను లేంది. అందుకే అమ్మ వాళ్ళకే పెడుతుంది. ఇది బొత్తిగా అన్యాయం. అన్యాయానికి అన్యాయం చెయ్యడమే న్యాయం. ఇంతకీ ఇదెవరిసొమ్ము గనక. తన తల్లి సొమ్ము తను తింటే తప్పా? లేదు...లేదు...తప్పులేదు...' అనుకుంది సావిత్రి. ఆరు వేలలో రెండు వేలు తనవి. అయినా అనుకోడంలో ఉందిగాని ఆవిడ నిజంగా ఆరువేలు కట్నం యివ్వలేదా యేమిటి? ఆరువేలేం కర్మ పదివేలయినా గుమ్మరించ గలదు.

అంగీకరించడానికి సిద్ధమయ్యే సమయంలో సావిత్రి మనస్సులో ఒక సందేహం విద్యుత్తులా ప్రవహించింది...నిలువెల్లా పీడించింది...అన్నీ బాగున్న సంబంధం...మొగపెళ్ళివారు...పెళ్ళికొడుకు తల్లి యీయన్ని బతిమాలుకుని ఈయనకి లోపాయికారీగా రెండువేల రూపాయలు లంచం యిచ్చుకోవలసిన అవసరం ఏమొచ్చింది? పెళ్ళికొడుక్కి ఏదయినా లోపం ఉందా?

ఆయన మళ్ళీ డాబామీదకి రాగానే అడిగేసింది. చెప్పేదాకా ఊరుకో లేదు. 'ఆ అబ్బాయి కేం, కడిగిన ముత్యం. ఏ విధాన్ని చూసినా లోటులేదు. అయితే ఆ సుబ్బమ్మగారు బాగా గయ్యాళిదని గంజాం అంతా ప్రసిద్ధిట. వాళ్ళమధ్యే మనవైపు వచ్చేశారు. ఆస్తంతా ఆవిడ పేరే ఉందిట. ఎవరి పేర్న ఉంటే మనకేం? కొడుక్కి పెట్టక ఏం చేసుకుంటుంది? కాస్త మంచిమాట ఆడుతే ఇట్టే లొంగదీసుకోవచ్చు...ఇంతకీ కోడల్ని అనని అత్తగా రెక్కడుంటుంది గనక?...ఏం అలా చూస్తావ్, మీ సూరీడు ఏమీ కష్టపడిపోదులే...అసలంతా స్థిరపడి పోయింది కూడాను...ఆవిడ మన పిల్లని ఎక్కడో చూసిందిట. చాలా నచ్చిందిట. ఎలాగయినా దీన్నే

చేసుకుందామని పట్టుపట్టి నన్ను కబురంపించి అడిగింది. నే నేం చెప్పినా ఎంత చెప్పినా ఒప్పుకునేలా ఉంది. అయినా నేను తొందరపడ్డానా ? ఉహుం ఒక్క రెండువేలు మనవనుకున్నాను. అంతే. ఇది నాకూ ఆవిడకీ తప్ప ఆవిడ కొడుక్కైనా తెలీదు. అప్పుడే పెళ్ళికొడుకు వెళ్ళడం, పిల్లని చూసుకోడం మీ అమ్మ వాళ్ళడిగిన కట్నానికి ఒప్పుకోడం అన్నీ జరిగేయి. ఒక్కసారి చెప్పి నిన్ను ఆశ్చర్యంలో ముంచేద్దామని ఊరుకున్నాను. అంతేకాదు. మీ అమ్మ మూడెకరాల భూమిని అమ్మకానికూడా పెట్టిందట. సొమ్ము వసూలు కాగానే నా ద్వారా సుబ్బమ్మగారికి అందజెయ్యటానికి కూడా ఏర్పాటు పూర్తయింది. ఈ దెబ్బతో మనకీ మనకీ కొంచెం విరోధాలుకూడా తగ్గుతాయి. ఏం అలా తగ్గడం నీకు యిష్టంలేదా ?'

'బాగుందండీ' నాకిష్టం లేకపోడ పేమిటి...అబ్బాయి అన్నివిధాలా బుద్ధిమంతు డంటున్నారు కదా...సరే...అయినా అడిగి పుచ్చుకుంటే ఇస్తుందేమో ఈసారి గట్టిగా అమ్మ నడిగి చూదాం...ఇది మోసం కాదా అని' ఈసారి ఆయన భగ్గుమని తనమీద మండిపడ్డారు.

'అబ్బే ఇదే మోసం, ఆనాడు మీ తాయారు పెళ్ళికి మూడువేలు కట్నమిచ్చి నలుగురి దగ్గరా వెయ్యినూట పదహారు అని చెప్పడం మోసం కాదు! అవును. ఈ ప్రపంచంలో ప్రతిదీ మోసమే. ఉన్నమాట పెళ్ళాం బిడ్డలకి చెప్పుకోడంకూడా మోసమే. నేను నేనై చెప్పేను కాబట్టి నీకీ సంగతి తెలిసింది. చెప్పకపోతే ఏం చేదువో...'

ఈ దెబ్బతో తను పూర్తిగా ఓడిపోయింది. నిజమే, తనొకటీ ఆయనొకటీ అనుకోని మనిషి కాబట్టే ఈ సంగతి తనకి తెలియబరిచారు. చెప్పకపోతే ఆయన్ని అడిగేవా రెవరు ?

అదిగాక ఒకటా రెండా రెండువేల రూపాయలు. స్కూలు మేష్టరు జీవితంలో రెండువేల రూపాయల విలువ ఎంత ఎక్కువైనది! అయినా

తిన్నగా అడుగుతే ఆవిడ ఎప్పుడిచ్చింది గనక! సుశీల మొగుడు ఫారెన్ వెడతానంటే అమ్మ వెయ్యి రూపాయలు నిలుచున్నపళంగా ఇచ్చింది. అప్పు అని పైకి చెబుతుంది, ఎవడు నమ్ముతాడు? స్కూలికీ ఇంటికీ దూరమని సైకిలు కొనుక్కుంటాననీ ఆయన మూడేళ్ళనుంచి అడుగుతూంటే ఇదిగో అదిగో అనడమేగాని కానీ కళ్ళజూపిన పాపాన్న బోయిందా? తల్లేమిటి పిల్లేమిటి, ఎలాంటివాళ్ళకి అలా చెయ్యాలి.

'మీ రెలాచెబుతే అలా మసిలేదాన్ని. ఆడదాన్ని...నా కేం తెలుసు? మీరు చెప్పింది సబబే అనిపిస్తోంది. మీ యిష్టం' అనేసింది.

'అమ్మా, అలా అద్దంముందు ఎంత సేపు కూచుంటావే? ఇలా చూడు, ఎలా ఉన్నాయి నా బట్టలు?'

సావిత్రి నిద్రలోంచి లేచినట్టు — అటునుంచి యిటు తిరిగి చూసింది. పెద్దకూతురు ఇందిర అప్పుడే టైలరు తెచ్చిన కొత్త పరికిణీ, జాకట్టు కట్టుకుంది. పక్కింటి శేషుఅత్తచేత జడ వేయించుకుని మూడు ముస్తాబులూ అయి వచ్చింది. అదేకాదు, అందరూను.

'నా వెలా ఉన్నాయే?' అని ముందుకొచ్చింది రెండోది, సీత.

'నావో, మరి నావో' అంటూ అందరూ తన్ని చుట్టబెట్టేశారు. ఆఖరికి ఏడాదయినా వెళ్ళని బాబ్జీగాడు సహా — బాడీ ఇజారు ఒక కాలిలోనే రెండు కాళ్ళూ ఎక్కించుకుని బోర్లా పడ్డాడు. చిట్టి వాడ్ని లేవదీసి సరిగ్గా తొడిగింది.

'మరి నా బత్తలో' అంటూ వచ్చీరాని మాటలతో అమ్మ నడిగాడు. సావిత్రి వాణ్ణి ఎత్తుకు ముద్దెట్టుకుంది.

'అందరి బట్టలూ ఫష్టుగా ఉన్నాయి' అంటే పిల్లలు సావిత్రిని విడిచి పెట్టలేదు. అందిరికన్నా ఎవరివి బాగున్నాయో చెప్పి తీరాలన్నారు.

'ముందు బాబ్జీగాడివి బాగున్నాయి. తరవాతనేమో చిట్టివి.'

'అవును — తెల్లగా ఉంటాడని వాడంటే నీకు ముద్దు. వాడికి నైలాను గుడ్డ తీసుకుని నాకు మామూల్ది కుట్టించావు. ఛీ — యీ చొక్కా నాకొద్దు.' అని అయిదేళ్ళ రఘు ఏడుపు ప్రారంభించాడు.

'నీకు బాగా సాయం చేస్తుందని చిట్టంటే నీకు యిష్టము. అందుకనే దానికి మంచి మంచి రంగులు ఎంచి కొంటావు.'

అని ఇంకా ఏమో అనబోతోంది సీత; సావిత్రి ఛళ్ళని ఒక్క లెంపకాయ వేసింది. ఆచేత్తో రఘుకి కూడా ఒకటి వేసింది.

'ఛీ...వెధవల్లారా...చిన్నప్పట్నుంచీ వెధవ రకాలూ మీరూను. పొండి అవతలకి...పోతారా పోరా.'

పక్కింటి శేషు అత్త పరుగెత్తుకుని వచ్చింది.

'పనివేళా పిల్లల్ని ఏడిపించావుటమ్మా...మా మంచిదానవేనమ్మా సావిత్రమ్మా! మీరూ నలుగురు అప్పచెల్లెళ్ళు ఉన్నారు. ఒకరి కెక్కువా ఒకరికి తక్కువా అని ఎప్పుడూ అనుకోనే లేమటమ్మా. నోరెరగని గుంట నాగమ్మలు కాబట్టి వాళ్ళని చావగొట్టేవ్...ఇదే పెద్దవాళ్ళయితే వాళ్ళనేవ రేం చెయ్యాలో' అనుకుంటూ పిల్లల్ని వెంటబెట్టుకు పోయింది. సావిత్రినోట మాట రాలేదు!

ఈ పిల్లల దెబ్బలాటలు ఎప్పుడూ ఉన్నాయి. ఈవిడ వెనకేసుకు రాడమూ ఎప్పుడూ ఉంది. కాని ఇవాళ అవి డడిగిన ప్రశ్నలు, మళ్ళీ మళ్ళీ గుచ్చి గుచ్చి తన్ని బాధిస్తున్నాయి...ఆ ప్రశ్నలు ఆవిడని ఎంతగా కలచి వేశాయో ఆమె మొహం చూస్తేనే తెలుస్తుంది. కాని సావిత్రి మొహం ఎలా ఉందో ఎవరూ చెప్పడం కష్టం. ఎంచేతంటే రెండు చేతులతోనూ మొహాన్ని దాచుకుని మోకాళ్ళమీద పెట్టుకూర్చుంది. ఎంత సేపు కూచుందోగాని ఎవరో తలుపు తట్టినప్పుడు మాత్రం మొహాన్నీ చేతుల్నీ

తొందరగా చీరచెంగుతో తుడిచేసుకుని తలుపు తీసింది. ఆ వచ్చింది వాళ్ళ ఊరు మునసబు రామయ్య.

'ఇదేమిటి బుల్లెమ్మగారూ ఎన్నిసార్లని తలుపు కొట్టనూ...అరచి అరచి నోరు నొప్పెట్టిపోయింది. ఇంట్లో లేరేమో అనుకున్నాను...అదేమిటి — ఆ బుగ్గల్నిండా ఆ మరకలేమిటీ, ఏడుస్తున్నారా ?'

సావిత్రి అప్పటికిగాని ఈ లోకంలో పడలేదు.

'అబ్బెబ్బే నిద్దరోయానండి...నాన్న కల్లోకి వచ్చారూ...'

మునసబు కళ్ళు పై చెంగుతో తుడుచుకున్నాడు.

'ఎంతటి ధర్మాత్ముడు ! బ్రతికిన నాలుగురోజులూ హంసలా బ్రతికాడు.. చూడండి బుల్లెమ్మగారూ, ఈ కవరు అమ్మగారు మీ కిమ్మన్నారు. పట్నంలో కోర్టుపనుండి వచ్చాను తల్లీ...కవర్లో సొమ్ముందిట...లెక్క చూసుకోండి. మళ్ళీ వస్తా వేళయిపోతోంది.'

'భోజనానికి ఇక్కడికే రావాలిసుమండీ' అని సావిత్రి అనే లోగానే ఆయన దాటేశాడు. హడావిడిమనిషి. సావిత్రి గబగబా కవరు విప్పింది. పది వందరూపాయల నోట్లూ, ఒక ఉత్తరమూను ! ఉత్తరం సారాంశం ఇదే.

'ఇంటికి పెద్దమ్మాయివి. కానీ నీకెప్పుడూ సంతుష్టిగా పెట్టే అవకాశం నాకు కలగలేదు. ఇందులో వెయ్యి రూపాయలు పంపుతున్నాను, పెళ్ళికి బట్టలూ అవీ కుట్టించుకోండి. పెద్దదాన్ని అయిపోయాను. మీ రిద్దరూ నా పొరపాట్లు మన్నించి ఈ సొమ్ము తప్పకుండా తీసుకోమని నా కోరిక. ఇంకా ఇంకా బతుకుతాననీ, మొగపిల్లల' పెండ్లిళ్ళు కళ్ళజూస్తాననీ నాకేం నమ్మకంలేదు. ఈ పెళ్ళి నేనుచేసే ఆఖరి పెళ్ళి అనుకుంటున్నాను. ఆడపిల్లల పెళ్ళిళ్ళయినా చేశాననే తృప్తితో నా బరువు చాలవరకు తీరుతుంది. ఈ పెళ్ళి మీ ఆయనే కుదర్చడం మా అదృష్టం. మిగిలిన భూమి పూర్తిగా అమ్మేస్తే పదివేలు పైగా వచ్చాయి. అప్పులు తీర్చెయ్యగా ఎనిమిదివేలు

మిగిలేయి. ఈ పెళ్ళికి ఎలాలేదన్నా ఏడువేలు అవుతాయి కదా. ఇక మిగిలిన వెయ్యీ మీకు. మొగపిల్లల కింక యిల్లు మిగిలింది. రెక్కల మీద బతుకులే. వాళ్ళకిది చాలు. మీరిద్దరూ పదిరోజులు ముందుగా ఇక్కడకు వచ్చి ఉండాలని నా ప్రార్థన.' ఇవే నా కనుచూపుమేర భూములు ? ఇందు కేనా, ఇవన్నీ తెలిసిన తనేనా తల్లిని అన్నాళ్లూ సాధించింది ? ఇందుకోస మేనా తను మొగుడితో కలిసి రెండువేల రూపాయిలు పబ్లిగ్గా కమిషను కొడుతున్నది ?

'ప్రభూ ! పతనమయ్యే ఆఖరి క్షణంలో నయినా కళ్ళు తెరిపించావు' సావిత్రి చేతులెత్తి నమస్కరించింది.

కేవలం పశ్చాత్తాపంవల్ల పాపం పరిష్కృత మౌతుందని ఆమెకేం నమ్మకంలేదు. దీనికి ప్రతికృతి చెయ్యాలి. ప్రశాంతి పొందాలి. ఏమిటది ? ఎలాగ ఈ మోసాన్ని ఆపడం ? ఆయన అప్పుడే వెళ్ళనే వెళ్ళేరు. పై ఊళ్ళో పనిచూసుకుని రేపు అక్కడికి చేరుకుంటున్నారు. ఆ పాపపు సొమ్ము తెస్తున్నారు. బలహీనుడైన బీదవాడు అసూయతో చేసే అమానుష మైన పని ఆయన చేస్తున్నారు. ఆ సొమ్ము తనకి వద్దు, తన పిల్లలకి వద్దు. ఆ సొమ్ములో ఒక్క దమ్మిడీ ముట్టుకున్నా తాము భగ్గున మండి పోతారు. తనకీ ముగ్గురు ఆడపిల్ల లున్నారు. వాళ్ళకీ పెళ్ళిళ్ళు కావాలి. వద్దు...ఆ డబ్బు ఎంతమాత్రం తన కొద్దు.

అయిదుగురు పిల్లలతో...బడిపంతులు పని చేస్తున్న భర్తతో...ప్రతి వస్తువు ధరా ఆకాశాన్నంటే పట్నంలో...పదిహేనేళ్ళయి తను గుట్టుగా కాపురం చేస్తోంది. తనువు పెట్టే చిచ్చు ఎలాంటిదో తను అప్పుడప్పుడు ఎరుగును. మనసు పెట్టే చిచ్చు...అబ్బ...హబ్బ...మరీ ఇంత కార్చిచ్చా? ఎలా ? ఎలా దీన్ని భరించడం ?

నిజం చెప్పేస్తుందా ?భర్తను బయటపెట్టు కుంటుందా ?

వీల్లేదు. ఎంతమాత్రం వీల్లేదు.

ఇంట్లో ఎవరికీ కాఫీ లేనినాడు ఆయ నొక్కరూ హోటల్లో కాఫీ తాగి వస్తే మందహాసంతో మన్నించింది.

చంటిపిల్లాడు జ్వరంతో బాధపడుతూంటే పదిగంటలకి పేకాటనుంచి వస్తే సహనంతో క్షమించింది. డబ్బుకోసం ఎవరు ఏ పని చెయ్యరు గనక ? అందులో బలహీనుడైన తన భర్త తలపెట్టింది ఏమంత ఎక్కువ గనక ?

మరి ?

ఈ దురంతం తనకి తెలిసి తన కళ్ళముందు సాగవలసిందేనా ?

'నువ్వు చూస్తూ ఊరుకున్నావా పెద్దక్కా, నన్ను తెలిసి తెలిసి ఈ మహమ్మారికి అప్పచెబుతావా పెద్దక్కా...రెండువేల రూపాయలు లంచం తిని నన్నీ రాక్షసి అత్తకి అంటగడతావా ? ఈ డబ్బు నీకు అరుగుతుందా పెద్దక్కా ?'

'వద్దమ్మా సూరేడూ ఏడవకు—అలా జరగనియ్యను. నేను బతికుండగా అలా జరగనివ్వను...'

కొద్ది గంటలలో సావిత్రి మొహం గుర్తించలేనంతగా మారిపోయింది. తన తెలివినంతటినీ కూడగట్టుకుని ఆఖరికి తల్లి కిలా రాసింది :

'నీ ఉత్తరం, వెయ్యి రూపాయల సొమ్మూ అందినవి. తల్లిదండ్రుల్ని పిల్లలు సాధారణముగా ఎప్పుడో ఒకప్పుడు అపార్థం చేసుకుంటారు. తెలిసో తెలియకో తప్పులు చేస్తూంటారు. అలాంటివారికి నే నేమీ అతీతురాల్ని కాదు. తల్లివి కాబట్టి నన్ను క్షమిస్తావు, అంతే నాకు చాలు.

'ఈమధ్య ప్రైవేట్లు ఎక్కువగా చెప్పడంవల్ల ఆయనకి పైన మరో వంద దొరుకుతోంది. కిందటేడు ఇంగ్లీషు ఎగ్జామినరు అవడంచేత మరో మూడువందలు కలిసివచ్చాయి. సొమ్ముకి ఎటువంటి ఇబ్బందీ లేదు. వెయ్యి

తిరిగి పంపుతున్నానని మరోలా అనుకోకు. విలువైనది ఏమిటో నా కిన్నాళ్ల కయినా తెలిసింది. అది చాలు.

'నువ్వు ఈడూరి సుబ్బమ్మగారి సంబంధం మన సూరీడికి కుదిర్చావని ఆయన చెప్పేరు. నా మొహంగాని ఆయన కుదర్చడ మేమిటి? అప్పుడే అనుకున్నాను, తిన్నగా కనుక్కుంటారా...అంతా రెడీ అయిపోయిందని విని ఆశ్చర్యపోయాను. ఆవిడ గురించి బాగా వాకబు చేశాను. ఆ సుబ్బమ్మ గారు చాలా గయ్యాళి మనిషిట. ఆస్తంతా ఆవిడపేరే ఉందిట. దమ్మిడీ అడగడానికి అంత వయస్సొచ్చిన కొడుక్కీ హడలేట. ఎక్కడ చదువు మానిపించేస్తుందో అని చచ్చేభయమట. ఆవిడ నోటికి భయపడి సంబంధాలు కూడా రావడంలేదుట. ఇలాంటిదాంతో మన సూరీడు ఏం వేగగలదు? ఈ సంబంధం ఎంతమాత్రం చెయ్యొద్దు. తెలియకపోతే అదోమాట, తెలిసి తెలిసి పిల్ల గొంతుక ఎలా కోసుకుంటాము? ఎవరెన్ని చెప్పినా ఆఖరికి మీ అల్లుడు చెప్పినా ఎంతమాత్రం లొంగకు. చెల్లాయి జీవితం నిష్కారణంగా నాశనమైపోతుంది...ఏ జాతకాలో పడలేదని తోసి పారెయ్యి.

'నే నిలా రాశానని ఎవరికీ—ఆఖరికి ఆయనకికూడా తెలియజెయ్య వద్దు. ఈ ఉత్తరం చదివిన వెంటనే చింపెయ్యి.

'ఆయన ఒట్టి చేశామనిషి. అంతలో కోపం—అంతలో సంతోషమూను. ఇది కాదంటే ఆయనకి దూరమౌతానని మాత్రం అనుకోవద్దు. ఫరవాలేదు, నేను మరింత దగ్గిరౌతాను.

ఆరువేలు ఇస్తామని మనం ఇదివరకు నలుగురికీ తెలిసేలా వెల్లడి చెయ్యలేదు. చేస్తే లక్షమంది వస్తారు. దాని పెళ్ళికోసం నువ్వేమీ బెంగ పెట్టుకోవద్దు.

చిన్నవాళ్ళం. నీకు తెలిసినవీ తెలియనివీ అనేకం తప్పులు చేస్తూటాం. మమ్మల్ని మనసారా మన్నించు.'